క్లుప్తంగా

220 మందికి వస్త్రాల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి ఎస్సీ వీధిలో 220మంది నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తుడు పి.ఎండయ్య వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ఎస్సీ వీధిలో 200మందికి, ఎస్టీ వీధిలో 20మందికి చీరలు, లుంగీలు నిరుపేదలకు అందజేశారు. కార్యక్రమంలో ఎండయ్య కుటుంబసభ్యులు పి.ప్రసాద్, రాజు, నారాయణరావు, చంద్రమ్మ, ఏసేబు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, కె.అప్పయ్య, కె.లతాని యేలు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్ల నిర్మాణం



గంగాడలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

బలిజిపేట: మండలంలోని గంగాడ గ్రామంలో రోడ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోంది. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో సీసీ రోడ్లు కావాలని ఎమ్మెల్యే జోగారావును గ్రామస్తులు కోరడంతో సత్వరమే రోడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని నాయుడు వీధి నుంచి పెద్దవీధి వరకు రెండు రోడ్లు, పెద్ద వీధి నుంచి కోమటివీధికి ఒక రోడ్డు, బీసీ కాలనీలోని 2వీధులు, పెద్దవీధి వద్ద ఒకటి, శివాలయం సమీపంలో ఒకటి, ప్రధాన వీధి నుంచి ఆమా సరాము ఇంటి వరకు ఒక రోడ్డు నిర్మాణం జరుగుతోంది. గ్రామంలో రోడ్ల నిర్మాణం త్వరగా జరుగుతుండడంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అప్పలనాయుడు, తదితరులు

సాలూరు: క్రీడలతో మానసికోల్లాసం పొందవచ్చని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు అన్నారు. నవోదయ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామానుజన్ గణిత క్లబ్ వ్యవస్థాపకులు రంభ రజనీకాంత్, డాక్టర్ పెంట శ్రీనివాస్, గులిపల్లి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

మక్కువ: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ శివరాజా, స్థానిక ఎస్సై పైడిరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ క్యాంప్ కార్యాలయంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన జవాన్లకు అధికారులు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



శివరాంపురంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని శివరాంపురం సర్పంచ్ జర్జాపు మోహన్ అన్నారు. జన్ భాగీదరీ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పార్వతి ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

- జగనన్న ఆణిముత్యాలుకు సన్మానం
- జిల్లా టాపర్‌కు రూ.50వేలు, నియోజకవర్గ టాపర్‌కు రూ.15వేల నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందించేందుకు ఏర్పాట్లు
- నేడు నియోజకవర్గం, 17న జిల్లా టాపర్లకు సత్కారం



పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో వసతులు, ఇంగ్లీషు మీడియం చదువులు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతిదీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా, నియోజకవర్గస్థాయిలతో పాటు ఆయా యాజమాన్యాల వారీగా టాపర్లకు బహుమతులు అందించనున్నారు. ఈ మేరకు జిల్లాలో నియోజకవర్గం, జిల్లా స్థాయిలో 16 మందిని ఎంపిక చేశారు. నేడు నియోజకవర్గ స్థాయి, 17న జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

జాబితాలు సిద్ధం..

జిల్లా విద్యాశాఖ అధికారులు మొదటి మూడు స్థానాలో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేశారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సాహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు పిల్లల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయని, వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు.

ప్రోత్సాహకాలు ఇలా..

జిల్లాలో నియోజకవర్గాల వారీగా అత్యధిక మార్కులు సాధించిన మొదటి, రెండు, మూడో ర్యాంకు సాధించిన వారికి రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకర్‌కు రూ.50 వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.30 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం అందించనున్నారు.

జిల్లాలో ప్రోత్సాహకాలు ఇలా..

మండలం	విద్యార్థి	మార్కులు	ప్రోత్సాహకం(రూ.)
కురుపాం	కర్రి తనుశ్రీ	585	15,000
జియ్యమ్మవలస	బడే శివకేశవనాయుడు	581	10,000
జియ్యమ్మవలస	నల్లా వెంకటనాయుడు	577	5000
పాలకొండ	హేమలత పాడి	587	15,000
పాలకొండ	దూడి అప్పారావు	586	10,000
వీరఘట్టం	వంజరాపు రాంబాబు	578	5,000
బలిజిపేట	డి. ఉమామహేశ్వరి	582	15,000
పార్వతీపురం	అక్కేన జోత్స్న	582	15,000
పార్వతీపురం	జనగం గాయత్రి	582	15,000
బలిజిపేట	ఎస్.ఉమామహేశ్వరి	581	10,000
బలిజిపేట	జి. స్రవంతి	580	5,000
పార్వతీపురం	పి.ఉమామహేశ్వరరావు	580	5,000
బలిజిపేట	కర్రి తిరుపతి	580	5,000
సాలూరు	కర్రి గౌరీశంకరరావు	585	15,000
సాలూరు	టి. రామకృష్ణారావు	581	10,000
సాలూరు	పి. వెంకట్రావు	578	5,000

శుభ పరిణామం



ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభ పరిణామం. దీని వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుంది. రాష్ట్ర, జిల్లా, నియోకవర్గ స్థాయిలో ర్యాంకులు సాధించాలనే తపన కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నత స్థానాలు అందిరోహించే అవకాశం దొరుకుతుంది.

– ఎస్. ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

అంధత్వ నివారణే లక్ష్యంగా నేత్ర వైద్యశిబిరాలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యులు

సీతానగరం: గ్రామాల్లో కంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సీతానగరం ఎంపీటీసీ బి.కుసుమ కోరారు. ఈ మేరకు బుధవారం పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కుసుమ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అంధత్వ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిపుణులతో ఉచితవైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, కంటిశస్త్రచికిత్స చేయించడం, అవసరమైన వారికి కంటి అద్దాలు సమకూరుస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా నిర్వహించిన కంటి పరీక్షలలో ముగ్గురికి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని వైద్యులు నిర్ధారించారని, 16 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు తెలియజేశారని చెప్పారు. అలాగే పాఠశాలల్లో చదవడానికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు చేయడం ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పెదభోగిలి సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు పిలుపు

పార్వతీపురంటౌన్: రక్త దానం చేయండి. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడండని ఎమ్మెల్యే జోగారావు యువతకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏపీఎన్జీఓ హోంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారి వద్దకు వెళ్లి వారికి పళ్ల రసాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం అనే మహోత్సవ కార్యక్రమం నేడు ప్రపంచంలో మిలియన్ల మంది జీవితాలను రక్షించడానికి సహాయపడుతోందని, దీంతో ప్రాణాంతక పరిస్థితులతో బాధపడుతున్న రోగులకు ఎక్కువ కాలం జీవించడానికి ఆస్కారం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వాగ్దేవి, వైద్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రక్తదాతలు, ఏపీఎన్జీఓ, ఉద్యోగ సంఘాల సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దబ్బగెడ్డలో పాఠశాల ప్రారంభం

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డలో ఏర్పాటు చేసిన పాఠశాలను ఎంఈఓ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ మర్రి పారమ్మ, సర్పంచ్ ఎస్. లక్ష్మి బుధవారం ప్రారంభించారు. గ్రామంలో గతంలో ఆర్‌సీఎం పాఠశాల ఉండేది. ఆ పాఠశాలను మూసివేయడంతో విద్యార్థులు పక్కనున్న గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. తాజాగా విద్యార్థుల సౌకర్యార్థం గ్రామంలో తాత్కాలిక పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు కాగా.. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఎంఈఓ మల్లేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం తాత్కాలిక పాఠశాల భవనంలో ఒకటి, రెండు తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు హరి సాయి రామకృష్ణ, పకీరు, కృష్ణ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



పార్వతీపురం టౌన్: సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని ములగ గ్రామానికి చెందిన గులిపిల్లి ఉమ, భర్త తిరుపతి రావు అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు సీఎం సహాయ నిధికి సిఫార్సు చేశారు. ఫలితంగా మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జోగారావు బుధవారం అందజేశారు. కష్ట కాలంలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్నందుకు వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి వచ్చిన రూ.1.60 లక్షల చెక్కును మండలంలోని కృష్ణారాయపురంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు అందజేశారు. పాపమ్మవలస గ్రామానికి చెందిన రెడ్డి అనిత తండ్రి మురళిగ తంలో ఆనారోగ్యానికి గురవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సహాయం



సీతానగరం: అగ్ని ప్రమాద బాధితులకు నగదు, బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని కృష్ణరాయపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు అగ్నికి ఆహుతై ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఎమ్మెల్యే జోగారావు సహాయం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం బాధితులను పరామర్శించి ఓదార్చారు. అగ్ని ప్రమాద సంఘటనకు గల కారణాలను తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనవంతు సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ 5,000, 50 కేజీల బియ్యం, బట్టలను అందచేశారు.

వేడుకగా కుండల పోలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సాలూరు: మండలంలోని పీఎన్ బొడ్డవలసలో కుండల పోలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

ముగ్గురు అంగన్వాడీ సహాయకులకు పోస్టింగ్ ఉత్తర్వులు

సీతానగరం: మండలంలోని దయానిధిపురం, బక్కుపేట, వెంకటపురం(ఎస్)గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల సహాయకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఐసీడీఎస్ పీఓ సీహెచ్ సుగుణ బుధవారం పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు. దయానిధిపురానికి యాళ్ల పార్వతి, బక్కుపేటకు ఎస్.శైలజ, వెంకటపురానికి రౌతు కల్యాణి అంగన్‌వాడీ కార్యకర్తలుగా ఎంపికయ్యారు.

ముగ్గురు కొత్త సూపర్‌వైజర్ల చేరిక

మండలంలో ఇంతవరకు పనిచేసిన ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పి.అరుణకుమారి, సీహెచ్ అరుణకుమారి, సుబ్బలక్ష్మిలకు బదిలీ కాగా వారి స్థానంలో పూర్ణిమ, పద్మావతి, సురేఖలు చేరినట్లు పీఓ సుగుణ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ వస్తుందని 19వ తేదీ నుంచి 24 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 21 నుంచి 23 వరకు స్పెషల్ కేటగిరి వారికి వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలన్నారు. జూలై 3న సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. వచ్చే నెల 4 నుంచి తరగతులు ప్రారంభమౌతాయని తెలిపారు.

ఎంఆర్‌సీని సందర్శించిన డీఈఓ

సీతంపేట: స్థానిక ఎంఆర్‌సీని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జేవీకే ఫోర్‌లో భాగంగా షూస్, బ్యాగులను పరిశీలించారు. మండలానికి ఎన్ని కిట్లు వచ్చాయి? తదితర వివరాలు తెలుసుకున్నారు.

వేతనదారులకు ప్రభుత్వ పథకాలు వివరించాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్

పార్వతీపురంటౌన్:

ఉపాధి పనులకు ఎక్కువ మంది వేతనదారులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు సి.విష్ణు చరణ్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీడీ, ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సామాజిక భద్రతా పథకాలను వేతనదారులకు వివరించాలని తెలిపారు. వేతనదారులకు సంక్షేమం అందించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న కార్మికులకు పనికి తగిన కనీస వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మొక్కలను నాటాలని ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. కేటాయించిన పనులను సత్వరం పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని కోరారు. ఆధార్ కార్డులను పదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకునేలా ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఎ పీఓ సి.విష్ణు చరణ్

జగనన్నతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

సీతానగనరం: ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణఅన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.శివున్నాయుడు ఆధ్వర్యంలో విద్యా కానుక కిట్‌లను విద్యార్థులకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నేతృత్వంలో మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యాబోధనకు అవసరమైన సదుపాయాలను జగనన్న ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయిపిల్లి అరుద్రమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ కె.ఉషారాణి, ఉపసర్పంచ్ బి.సింహాచలం, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న వైస్‌ఎంపీపీ సూర్యనారాయణ

ఇంటింటికీ కుళాయిలతో తాగునీరు

భామిని:

ప్రతీ ఇంటికి కుళాయిలతో తాగునీరు అందివ్వడమే జలజీవన్ మిషన్ పథకం అమలు చేస్తున్నట్టు మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు అన్నారు. లోవగూడలో రూ.8లక్షల జేజేఎం నిధులతో జలజీవన్ పథకం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు బుధవారం ప్రారంభించారు. ప్రతీ గిరిజన ఇంటికి కుళాయిలతో నీరు సరఫరా చేయనున్నట్టు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వలరౌతు సింహాద్రి, వలరౌతు రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



పథకం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డైరెక్టర్ కృష్ణారావు, నాయకులు

గిరిజనులకు చీరల పంపిణీ

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ గొందిలోవ గిరిజన గ్రామంలో 40 మంది గిరిజనులకు పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి బుధవారం వారి గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చీరలు, తువ్వాళ్లు, లుంగీలు, స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చినటువంటి జీతంలో ఎంతో కొంత పేదలకు సాయం చేయడమే తృప్తిగా ఉంటుందని నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటానన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనకు సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు రాగాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బిడ్డిక వెంకటరావు, బిడ్డిక రమేష్, రాజు, రాము పాల్గొన్నారు.



గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి

త్వరితగతిన ఎన్‌సీడీసీ సర్వే

సీతంపేట:

ఎన్‌సీడీసీ (నాన్ కమ్యూనికల్ డీసిజెస్) సర్వే శుక్ర, శని, ఆదివారాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.సత్యం ఆదేశించారు. దోనుబాయి, మర్రిపాడు, కుశిమి పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్‌లు, వెలుగు మహిళా సంఘాల సహకారం తీసుకోవాలన్నారు. కొండలపై కొన్ని గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ సమస్య ఉండడంతో నాలుగైదు గ్రామాలు కలిపి ఒక దగ్గర చేర్చి యాప్‌లో నమోదు చేయాలన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



మత్స్య జాతులపై బీజెడ్‌సీ విద్యార్థులకు అవగాహన

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బీజెడ్‌సీ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. జంతు శాస్త్ర అధ్యాపకులు బి.రాజు నేతృత్వంలో స్థానిక చేపల మార్కెట్‌లో పర్యటించారు. అక్కడ అందుబాటులో ఉన్న వివిధ రకాల మత్స్య జాతులు, వాటి ఆవశ్యకత, శరీర నిర్మాణం, ఆకృతిపై జంతుశాస్త్ర విభాగాధిపతులు అవగాహన కల్పించారు. సముద్రపు చేపలు, మంచినీటి చేపలు, మృదులాస్థి చేపలు, అస్థి చేపలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధ్యాపకులు సమాధానాలు చెప్పి అవగాహన కల్పించారు.